వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 44 సోమవారం | 07 ఆగస్టు 2023 | పేజీలు : 08 | వెల రూ. 5

8లో

సైలెన్సర్లు మార్చితే క్రిమినల్ కేసులు

ట్రాఫిక్ ఏసీపీ భోజరాజు

పలు సైలెన్సర్ల ధ్వంసం

కాళోజీ ప్రతిష్ఠ ప్రతిబింభించాలి

కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్ రాజ్ యాదవ్

తాను ఉన్నంత కాలం ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే లక్ష్యంగా జీవించిన కాళోజీ స్ఫూర్తిగా హనుమకొండ జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న కళాక్షేత్రం నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయాలని కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ సంగం రెడ్డి సుందర్ రాజ్ యాదవ్ కోరారు. కూడా ఇంజనీరింగ్, ప్లానింగ్ అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో కలిసి సోమవారం ఆయన కాళోజీ కళాక్షేత్ర నిర్మాణ పనులను పర్యవేక్షించారు. ఆడిటోరియం, ఎంట్రెన్స్, సౌండ్ సిస్టం, సీటింగ్ పనుల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

– వరంగల్ వాయిస్, హనుమకొండ

పద్మశాలి బంధు ప్రకటించాలి

వారిపై వివక్ష తగదు

సమష్టి కృషితోనే రాజకీయ హక్కులు సాధించుకుంటాం

బీజేపీ రాష్ట్ర నాయకులు కుసుమ సతీష్, వన్నాల వెంకటరమణ

8లో



స్వర్గసీమకు 'పోరు'పాట

ఉద్యమ దివిటీ గద్దర్

ఆగిపోయిన ప్రజా యుద్ధనౌక

పాటలతో తెలంగాణ ఉద్యమానికి ఊపిరి

జీవితమంతా పోరుబాటే

అల్వాల్‌లో ముగిసిన అంత్యక్రియలు

పాల్గొన్న ముఖ్యమంత్రి కేసీఆర్

'అమ్మా తెలంగాణమా.. ఆకలి కేకల గానమా' అంటూ సాగిన పాటల తూటా అర్ధంతరంగా మూగ బోయింది. పొడుస్తున్న పొద్దుమీద కాలమై నడిచిన పాట.. మధ్యలోనే ఆగిపోయింది. దగాపడిన బతుకుల పక్షాన నిలబడిన యుద్ధనౌక తుదిపోరాటం చేయకుండానే ఆగిపోయింది. శ్రామికుల స్వేదం లెక్కగట్టలేమని పసిగట్టి గోచీగొంగడి కట్టి, కర్ర చేతబట్టి, కాలికి గజ్జెకట్టి ఇంతకాలం పోరాడిన ఓ యోధుడు అలసిపోయాడు. తూటాలను గుండెల్లో దాచుకుని కూడా గుండెనిబ్బరం కోల్పోకుండా పోరాడిన నిఖార్సయిన ఉద్యమ బిడ్డ. అప్పటికప్పుడు ఆశువుగా పదాలల్లి, పాటలను ఈటెలుగా మార్చి విసిరిన ధీశాలి. కోట్లాదిమంది గొంతుకై ఊరూరా ఉద్యమాన్ని ఉరకలెత్తించిన తొలితరం ప్రజా గాయకుడు గద్దర్. ఆదివారం సాయంత్రం హైదరాబాద్ లోని ప్రైవేట్ ఆసుపత్రిలో తుది శ్వాస విడిచారు. సోమవారం సాయంత్రం అల్వాల్ లోని గద్దర్ స్వగృహం సమీపంలో ప్రభుత్వ లాంఛనాలతో ఆయన అంత్యక్రియలను నిర్వహించారు.

- వరంగల్ వాయిస్, హైదరాబాద్

2లో..

వరంగల్ వాయిస్ Evening Daily
సోమవారం 07, ఆగస్టు 2023
www.warangalvoice.net

స్వర్గసీమకు 'పోరు'పాట

ఉద్యమ దివిటీ గద్దర్

ఆగిపోయిన ప్రజా యుద్ధనౌక

పాటలతో తెలంగాణ ఉద్యమానికి ఊపిరి

జీవితమంతా పోరుబాటే

అల్వాల్ లో ముగిసిన అంత్యక్రియలు

పాల్గొన్న ముఖ్యమంత్రి కేసీఆర్

వరంగల్ వాయిస్, హైదరాబాద్ : *ప్రజా గాయకుడు గద్దర్ మరణంతో యావత్ తెలంగాణ శోకతప్తమయ్యింది. గద్దర్ చివరిచూపు కోసం పోటీ పడ్డారు. ఎల్బీ స్టేడియం నుంచి అశ్రు నయనాల మధ్య ప్రజా యుద్దనౌక గద్దర్ అంతిమ యాత్ర ప్రారంభమైంది. పోలీసుల గౌరవ వందనం.. స్లో మార్చ్, డెత్ మార్చ్‌లతో గన్ పార్క్‌కు అంతిమ యాత్ర బయలుదేరింది. గద్దర్ పార్థివదేహాన్ని ఎల్బీ స్టేడియం నుంచి అమరవీరుల స్థూపానికి తీసుకెళ్లారు. అమరవీరుల స్థూపం వద్ద ఆయన భౌతికకాయానికి నివాళులు అర్పించారు. ఈ అంతిమ యాత్రలో వేలాది మంది కళాకారులు, గద్దర్ అభిమానులు పాల్గొన్నారు. రాజకీయ నాయకులు, ప్రజాకళాకారులు వెంట నడిచారు. గద్దర్ పాటలతో హోరెత్తించారు. గద్దర్ అమర్ హై అన్ననినాదాలు మిన్నంటాయి. గన్ పార్క్, అసెంబ్లీ, అమరవీరుల స్మారక స్థూపం, నెక్లస్ రోడ్‌లోని అంబేద్కర్ విగ్రహం, ట్యాంక్‌బండ్, జేబీఎస్ మీదుగా గద్దర్ అంతిమ యాత్ర సాగింది.*

నక్సల్‌బరీ ఉద్యమంలోనూ..

నక్సల్‌బరీ ఉద్యమంలోనూ గద్దర్‌ది విడదీయలేని బంధం. పీపుల్స్ వార్ ఉద్యమం ఉధృతంగా ముందుకు సాగి..దొరల గుండెల్లో గునపాలు దింపింది. నిజాం పాలనకు వ్యతిరేకంగా వచ్చిన మా భూమి సినిమాలో గద్దర్ బండెనక బండి కట్టి పదహారు బండ్లు కట్టి.. ఏ బండ్లే పోతవు కొడుకో నైజాము సర్కరోడా' అనే పాటను గద్దర్ స్వయంగా పాడిన పాట దేశమంతా మార్మోగింది. గ్రామాల్లో జరుగుతున్న అన్యాయాలను, అకృత్యాలను ఎదురించడంతో పాటు ప్రజలను, ప్రత్యేకించి దళితులను మేల్కొలిపేందుకు వారిని చైతన్య పరచేందుకు జననాట్యమండలి వేదికగా చేసిన కృషి ప్రజల్లో చైతన్యదీప్తిని నింపింది. ప్రజా సమస్యలపై పోరాటం చేయడమేకాకుండా.. తనదైన పాటలతో అందరిని కదిలించిన గొప్ప ప్రజా గాయకుడు గద్దర్. గద్దర్ ప్రసంగాలు, పాటలు ప్రజల్లో స్ఫూర్తిని నింపాయి. అట్టడుగు వర్గాలకు గొంతుకై నిలిచారు. మీరీ పాటనై వస్తున్నానమ్మో.. అంటూ పాటకు మరణం లేదని, పోరాటమే పాట లక్ష్యమని గద్దర్ వర్ణించారు. సిరిమల్లె చెట్టు కింద లచ్చుమమ్మో.. లచ్చుమమ్మో.. అని దళితుల దైన్యాన్ని పాటలో వివరించారు ఆయన. తన పాటలను తన బృందంతో కలిసి క్యాసెట్లు, ఆల్బమ్స్, సీడీలుగా చేసి ప్రజలను చైతన్యం చేశారు. గద్దర్ గళం వినిపించిందంటే.. వేలాదిగా క్యాసెట్లు, సీడీలు అమ్ముడు పోయేవి. 1980 దశకంలో గ్రామీరీణ ప్రాంతాల్లో ఎక్కడ చూసినా గద్దర్ పాటలే వినిపించేవంటే అతిశయోక్తి కాదు. ప్రజలపై జరుగుతున్న అకృత్యాలను, అణచివేతలను ఎదుర్కొనేందుకు నక్సలైట్ ఉద్యమం పుట్టిందని భావించేవారు గద్దర్. నక్సలైట్ల ఉద్యమానికి సానుకూలంగా పాటలు పాడే వారు. 'పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న కాలమా.. పోరు తెలంగానమా' అనే పాట తెలంగాణ ఉద్యమంలో మరింత ఊపునిచ్చింది. తన గళంతోనే సమస్యలపై పోరాటాన్ని సాగించారు. ప్రజల్లో ప్రత్యేక రాష్ట్ర కాంక్షను, పోరాట పటిమను మేల్కొలిపారు. 1990 లో జనజీవన స్రవంతి లోకి వచ్చిన ఆయన 1996లో తెలంగాణ జనసభలో పాల్గొన్నారు. 2002లో నక్సలైట్ల ప్రతినిధులుగా వరవరరావుతో కలిసి గద్దర్ ప్రభుత్వంతో చర్చలు జరిపారు. గద్దర్ కు విదేశాల్లోని ఎన్నో అభ్యుదయ, సాంస్కృతిక సంఘాల నుంచి ఆహ్వానం వచ్చినా ఎక్కడికి వెళ్లలేకపోయారు. 1997లో ఆయనపై కాల్పులు జరిగ్గా.. 6 బుల్లెట్లు శరీరంలోకి చొచ్చుకుపోయాయి. 5 బుల్లెట్లను తొలగించగా.. వెన్నుపూసలో ఉన్న మరో బుల్లెట్ తొలగిస్తే ప్రాణాలకే హాని ఉంటుందని చెప్పి దానిని అలాగే ఉంచేశారు. అయితే ఎయిర్ పోర్టులకు వెళ్లిన ప్రతీసారి స్కానింగ్ లో బుల్లెట్ కనిపించేది. దీనిపై అధికారులకు సమాధానం చెప్పడంలో గద్దర్ ఇబ్బంది పడటం వల్ల అనుమతి లభించేది కాదు. శరీరంలో బుల్లెట్, కేసులు పాస్ పోర్టు జారీకి అడ్డంకిగా మారాయి. అలా విదేశాల నుంచి ఎన్ని ఆహ్వానాలు వచ్చినా విమానం ఎక్కి విదేశాలకు వెళ్లలేకపోయారు. అలాంటి నిఖార్సయిన కవి, గాయకుడు, ఉద్యమదీప్తి, ప్రజానాడి గద్దర్.

దొరల తెలంగాణ..

తెలంగాణ ఏర్పడిన తర్వాత ఎందరో పోరాట యోధులు కనుమరుగుయ్యారు. వారిని కావాలనే మరుగున పడేశారు. వారికి గౌరవం దక్కకుండా చేశారు. అందులో గద్దర్ కూడా ఒకరు. ఆయనకు కనీస గౌరవం కూడా దక్కలేదు. దీంతో తెలంగాణ వస్తే జీవితాలు బాగుపడతాయని భావించి..తరవాత మోసపోయామని..దొరల చేతుల్లోకి తెలంగాణ జారిపోయిందని గద్దర్ పలుమార్లు తనలోని బాధను వ్యక్త పరిచేవారు. మరోమారు పోరాటం చేయాల్సిన అసవరం ఉందని అందుకు తాను గజ్జెకడతానంటూ ప్రకటించారు. ఈ ఎన్నికల్లో పోటీ చేస్తానంటూ ప్రకటించారు. ఆయన నమ్మిన సిద్ధాంతం వేరు కావొచ్చు. నడిచిన బాట విభిన్నం కావొచ్చు. కాని ఆయన మానవతావాది. కుల, మత, లింగ వివక్షతలతో మనుషుల మధ్య లేచిన అడ్డుగోడలు కూలిపోవాలని కడదాకా కలగన్న వాడు. ఆధ్యాత్మికత, దైవం పట్ల ఆయన అభిప్రాయాలేవైనా అందరినీ ఆయన అమితంగా ప్రేమించాడు. అందరూ ఆయన్ని వెర్రిగా అభిమానించారు. లెఫ్టిస్టే అయినా ఎవరిపట్లా ఆయనకు వ్యతిరేకత లేదు. ఎదుటి వారి అభిప్రాయాన్ని గౌరవించే సంస్కారం ఆయనది. ఎంతో చనువుగా, ఆప్యాయంగా తన సమయాన్ని ప్రతి ఒక్కరితో పంచుకునే స్వభావం ఆయనది. పేద దళిత కుటుంబంలో పుట్టి, ప్రజాగాయకుడై, గోచీ, గజ్జె కట్టుతో పాటను ఫిరంగిలా పేల్చి, పీడిత జనులకోసం నిరంతరం కొట్లాడిన ధీశాలి గద్దర్. ఆయన భౌతికంగా లేకపోయినా, ఆయన పాట జాతి గుండెల్లో స్ఫూర్తి రగిలిస్తూనే వుంటుంది.

బౌద్ధ సంప్రదాయంలో అంత్యక్రియలు..

గద్దర్ స్వగ్రామమైన అల్వాల్ లో ఆయన స్థాపించిన మహాబోధి పాఠశాలలో అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. బౌద్ధ సంప్రదాయాలకు పెద్ద పీట వేసే ఆయనకు వారి పద్ధతి ప్రకారమే అంత్యక్రియలు పూర్తి చేశారు. అంత్యక్రియల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్గొని నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అంత్యక్రియల్లో పాల్గొనేందుకు స్థానికులతోపాటు అభిమానులు, కళాకారులు, రాజకీయ ప్రముఖులు, సినీ ప్రముఖులు వేలాదిగా తరలి రావడంతో ఆ ప్రాంతమంతా జనసంద్రంగా మారింది.

పలువురి నివాళులు..

గద్దర్ అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. కాగా, గద్దర్ మృతికి అసెంబ్లీలో ప్రభుత్వం సంతాపం ప్రకటించింది. మంత్రి కేటీఆర్.. శాసనసభ, శాసనమండలిలో ప్రభుత్వం తరపున సంతాపం తెలిపారు. ఆదివారం గద్దర్ మరణ వార్త తెలిసి అభిమానులు ఆస్పత్రి వద్దకు భారీగా తరలివచ్చారు. ప్రజా కవులు, కాంగ్రెస్, ఇతర పార్టీల నాయకులు ఆస్పత్రికి చేరుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఆ పార్టీ తెలంగాణ ఇన్‌చార్జ్ మాణిక్కం ఠాకూర్, ఎమ్మెల్యే సీతక్క, సీనియర్ నేతలు వీహెచ్, పొన్నం ప్రభాకర్, మధు యాష్కీ, అద్దంకి దయాకర్ తదితరులు ఆస్పత్రికి వచ్చారు. పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు గోరటి వెంకన్న, దాసోజు శ్రవణ్ సైతం చేరుకున్నారు. కవులు, కళాకారులు అరుణోదయ విమలక్క, జయరాజ్ తదితరులు పాటలతో నివాళు లర్పించారు.

గౌడ కుటుంబాలకు అండగా నిలవాలి

మంత్రి సత్యవతి, అధికారి బుర్ర వెంకటేశం గౌడ్‌లకు వినతి

వరంగల్ వాయిస్, హైదరాబాద్ : రాష్ట్ర మంత్రి సత్యవతి రాథోడ్ ను, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం గౌడ్ లను తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొనగాని యాదగిరి గౌడ్ హైదరాబాద్ లో మర్యాద పూర్వకంగా సోమవారం కలిశారు. రాష్ట్రంలో వృత్తి రీత్యా ఆధారపడి జీవనోపాధి పొందుతున్న గీత కార్మికులకు సేఫ్టీ మోకులను వెంటనే ఇవ్వాలని రాష్ట్ర మంత్రి సత్యవతి రాథోడ్ కు, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం గౌడ్ లకు వినతి పత్రాన్ని అందించారు. గీత వృత్తిపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న రాష్ట్రంలోని గౌడ కుటుంబాలకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి దొడ్డిపల్లి రఘుపతి, కౌండిన్య అసోసియేషన్ అఫ్ నార్త్ అమెరికా వాలంటీర్ బుర్ర రవీందర్ గౌడ్, బుర్ర శ్యామ్ గౌడ్ పాల్గొన్నారు.

ఇల్లందు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తా

బీఆర్ఎస్ నేత మూడ్ కృష్ణ ప్రసాద్ నాయక్

వరంగల్ వాయిస్, బయ్యారం : బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం ఆదేశిస్తే, ఇల్లందు నియోజకవర్గ శాసనసభ అభ్యర్థిగా పోటీ చేస్తానని ఆ పార్టీ నాయకుడు, మాజీ సర్పంచ్ మూడ్ కృష్ణ ప్రసాద్ నాయక్ వ్యక్తం చేశారు. గార్ల మండల కేంద్రంలోని వర్తక సంఘం భవనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ బీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను నియోజకవర్గ పరిధిలోని క్షేత్రస్థాయి వరకు ఇంటింటా విస్తృతంగా శ్రేణులతో పాటు పర్యటించి ప్రజానీకానికి చేరవేస్తానన్నారు. భారత రాష్ట్ర సమితి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంలో పెరిగిపోతున్న సంక్షోభాన్ని నివారించేందుకు అప్పుల ఊబిలో చిక్కుకోకుండా రైతులను రక్షించేందుకు ప్రభుత్వం "రైతుబంధు" పథకాన్ని కొనసాగిస్తుందన్నారు. తన అనుభవాలను వివరిస్తూ ఉన్నత స్థాయి విద్యను అర్జించి, ఉపాధ్యాయ శిక్షణను పూర్తి చేశానని తెలిపారు. 1994లో ఖమ్మం జిల్లాలో వామపక్ష విద్యార్థి సంఘానికి నాయకత్వం వహించి విద్యారంగ సంక్షేమానికి కృషి చేశానని, 1998లో వీఆర్వోగా, పని చేశానని తెలిపారు. 2001లో వీఆర్వో పదవికి రాజీనామా చేసి రాజకీయ ప్రవేశం చేసి పండితాపురం (కొమ్మనపల్లి) ప్రజాభిమానం చూరగొని సర్పంచ్ పదవి చేపట్టి అభివృద్ధి విషయంలో అహర్నిశలు కృషి చేశానని కృష్ణ ప్రసాద్ వెల్లడించారు. 2006లో జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేశానని, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా, క్రమంగా ఒదుగుతూ, ఎదిగి ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తన సేవలను విస్తృత పరిచానని మూడ్ కృష్ణ ప్రసాద్ నాయక్ వివరించారు. రెండు పర్యాయాలు నియోజకవర్గ అభ్యర్థిగా యత్నించానని, 2014లో తెలంగాణ రాష్ట్ర సమితిలో అరంగేట్రం చేశానని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువయ్యేలా కృషి చేస్తానని. అధిష్టానం ఆదేశాల మేరకు పని చేస్తానని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు.

త్రికుటేశ్వర ఆలయంలో శ్రావణ మాస పూజలు

వరంగల్ వాయిస్ భీమదేవరపల్లి : శ్రావణమాసంలో ప్రతి ఇల్లు ఆలయాన్ని తలిపిస్తుంది. నెలరోజులపాటు ఉదయం, సాయంత్రం భగవన్నామ స్మరణతో మారుమోగుతాయి. శ్రావణమాసంలో చేపట్టే ఇలాంటి కార్యానికైనా ఎంతో పవిత్రత ఉంటుందని భక్తుల నమ్మకం. ఈ సందర్భంగా ముత్తారం త్రికూటేశ్వర ఆలయంలో గురువారం నుంచి నిజ శ్రావణమాసం ప్రారంభం సందర్భంగా శ్రావణ మాస నిత్య గోత్రనామార్చన చేయబడుతుందని ఆలయ అర్చకులు చక్రాచార్యులు తెలిపారు. రూ.లు 216/- లు చెల్లించి భక్తులు వారి గోత్రనామాలు, పేర్లను నమోదు చేసుకొని ఆలయ అభివృద్ధిలో భాగస్వాములై, ఆ పరమశివుని కృపకు పాత్రులు కాగలరని ఆలయ చైర్మన్ కాశిరెడ్డి ఆదిరెడ్డి తెలిపారు.

మోరంచపల్లి వరద బాధితులకు 'కానా' సాయం

బోనగాని యాదగిరి గౌడ్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల పంపిణీ

వరంగల్ వాయిస్, భూపాలపల్లి : గత నెలలో కురిసిన భారీ వర్షాలతో వచ్చిన వరదల వల్ల భూపాలపల్లి జయశంకర్ జిల్లా మండలం మోరంచపల్లి గ్రామంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురైన విషయం తెలిసిందే. మోరంచపల్లి గ్రామంలో ఇబ్బంది పడుతున్న గౌడ కుటుంబాల పరిస్థితులను తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొనగాని యాదగిరి గౌడ్ కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా(కానా) సభ్యులకు తెలియజేశారు. మానవతా దృక్పథంతో కానా సభ్యులు వెంటనే స్పందించి వరద బాధితులకు తమ వంతుగా సహాయం అందించేందుకు ముందుకు వచ్చారు. కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా(కానా) సభ్యులు నాతి శ్రీనివాస్ గౌడ్, రామగౌని మురళీ గౌడ్, ప్రముఖ ఆర్థో పెడిక్ వైద్యుడు అటికం గిరిబాబు గౌడ్, తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొనగాని యాదగిరి గౌడ్ ఆధ్వర్యంలో మోరాంచపల్లి గ్రామంలోని ప్రతి గౌడ కుటుంబానికి రూ.3000 విలువ చేసే (1 రైస్ బ్యాగ్, నిత్యావసర సరుకులు, బెడ్ షీట్లు) దాదాపుగా రూ.3లక్షల సరుకులను పంపిణీ చేశారు. అనంతరం వరద బాధిత గౌడ కుటుంబాలు 'కానా' సభ్యులకు , బొనగాని యాదగిరి గౌడ్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నారగోని కుమారస్వామి గౌడ్, నకరకంటి మోహన్ గౌడ్, వడ్లకోండ రమేష్ గౌడ్, కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా(కానా)వలంటీర్ల బృందం, సభ్యులు బుర్ర వినోద్ కుమార్ గౌడ్, బాల్నే రామచంద్రుడు, బుర్ర రవీందర్ గౌడ్, పాలకుర్తి వినయ్ కుమార్ గౌడ్, ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అడ్వైజర్ నాతి పండు గౌడ్, మహిళలు, గ్రామ గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిస్తే చట్టరీత్యా చర్యలు

వరంగల్ వాయిస్, వరంగల్ : రాత్రి వేళల్లో గుర్తు తెలియని వ్యక్తులు తరచుగా కరెంటు సరఫరాకు అంతరాయం కల్పిస్తున్న వారిని గుర్తించి పోలీసులకు అప్పగించాలని స్థానికులను 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి కోరారు. ఆదివారం రాత్రి వేళలో డివిజన్ లోని కరీమాబాద్ శివాలయం ఆంజనేయ స్వామి దేవాలయం కరీమాబాద్ మెయిన్ రోడ్ లో ఉన్న ట్రాన్స్ ఫార్మర్ను గుర్తు తెలియని వ్యక్తులు నాలుగు పర్యాయాలు బంద్ చేయడం వలన ప్రజలు కరెంటు పోయిందని ఎలక్ట్రికల్ సిబ్బందికి తెలియజేయగా ఎలక్ట్రిక్ సిబ్బంది నాలుగు పర్యాయాలు కరెంటు సరఫరా పునరుద్ధరించారు. ఈ విషయాన్ని ఎలక్ట్రిసిటీ ఏఈఈ అశ్విని కుమార్ కార్పొరేటర్ మరుపల్ల రవికి తెలియజేయగా వెంటనే కార్పొరేటర్ మరుపల్ల రవి ఏఈఈ అశ్విని కుమార్ లు కలిసి ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో గల ప్రజలను కలిసి కరెంటు అంతరాయం కాగానే బయటకు వచ్చి చూసి ఎలక్ట్రికల్ సిబ్బందికానిచో ఇతర ఎవరైనా వ్యక్తులు అయినచో మాకు గాని పోలీస్ శాఖకు గానీ సమాచారం అందించాలన్నారు. ప్రైవేటు వ్యక్తులు ట్రాన్స్ ఫార్మర్ వద్ద ఆన్ ఆఫ్ చేసిన చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎలక్ట్రికల్ ఏఈఈ అశ్విన్ కుమార్ తెలిపారు. వారి వెంట లైన్ ఇన్ స్పెక్టర్ రాజన్న, లైన్ మెన్ వెంకటేశ్వర్లు, జూనియర్ లైన్ మెన్ సాంబయ్య, రంజిత్, నాగరాజు, వనం కుమార్‌లు ఉన్నారు.

కింది వర్గాలకు రిజర్వేషన్ల ఫలాలు దక్కాలి

వరంగల్ వాయిస్, సుబేదారి : కింది వర్గాలకు రిజర్వేషన్ల ఫలాలు దక్కినప్పుడే సామాజిక న్యాయం సాధించబడుతుందని బీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు అభిప్రాయబడ్డారు. సోమవారం మండల్ డే సందర్భంగా యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బీపీ మండల్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ శేషు మాట్లాడుతూ మండల్ కమిషన్ రిపోర్ట్ ఆగస్టు 7న పార్లమెంట్ లో ఆమోదం పొందిన తరువాత దేశంలోని 56శాతం ఉన్న ఇతర వెనుకబడిన తరగతులకు కేంద్ర విద్యా, ఉద్యోగాలలో 27 శాతం రిజర్వేషన్లు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. మండల్ కమిషన్ రిపోర్టు అందుబాటులోకి వచ్చి రెండు దశాబ్దాలు అవుతున్నా ఓబీసీలకు ఇచ్చిన 27 శాతం రిజర్వేషన్లు పూర్తిగా అమలులోకి రాకపోగా 37శాతం ఓబీసీల కులాలకు ఇప్పటికీ రిజర్వేషన్లలో ప్రాతినిధ్యమే దక్కలేదన్నారు. మండల్ తన కమిషన్ రిపోర్ట్ లో ఓబీసీల అభివృద్ధి సంక్షేమానికి 40సిఫారసులు చేస్తే ప్రభుత్వాలు ఒక్క రిజర్వేషన్లు తప్ప ఏ సిఫారసుని అమల్లోకి తేలేదని ఓబీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లతో పాటు కుల గణన చేపట్టినప్పుడే బీసీలకు న్యాయం జరుగుతుందని శేషు అభిప్రాయబడ్డారు.

ఆకట్టుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఘనంగా ఆక్స్‌ఫర్డ్ 1998-99 బ్యాచ్ సిల్వర్ జూబ్లీ వేడుకలు

వరంగల్ వాయిస్, కమలాపూర్ : కమలాపూర్‌లోని ఆక్స్‌ఫర్డ్ ఉన్నత పాఠశాల 1998-99 టెన్త్ క్లాస్ స్టూడెంట్స్ ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంతో పాటు సిల్వర్ జూబ్లీ వేడుకలు కన్నుల పండుగగా జరిగాయి. వేడుకల్లో భాగంగా స్థానిక అయ్యప్ప టెంపుల్ లో సామూహిక అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రపంచ స్నేహితుల దినోత్సవం వేడుకలను పురస్కరించుకొని ఒకరికొకరూ ఫ్రెండ్ షిప్ బ్యాండ్లను కట్టుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సమాజ సేవ కోసం టెన్త్ 1998-99 బ్యాచ్ ఐక్యత ర్యాలీ ప్రధాన రహదారి వెంట కొనసాగింది. అనంతరం స్థానిక ఉమామహేశ్వర గార్డెన్ లో నిర్వహించిన వేడుకల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రేమ్ చందర్ ను గజమాలతో ఘనంగా సన్మానించి, స్నేహితులు తమ చిన్ననాటి స్మృతులను గుర్తు చేసుకున్నారు. 25ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం జరుగుతుండటంతో విద్యార్థుల ఆనందాలకు అవధులు లేకుండా పోయాయి. సమాజ సేవలో రాణిస్తున్న ఈ బ్యాచ్ ఎందరికో ఆదర్శమని, వారి సేవలు సమాజానికి ఎంతో అవసరమని టెన్త్ బ్యాచ్ సేవలను ఆక్స్ ఫర్డ్ ప్రధానోపాధ్యాయుడు ప్రేమ్ చందర్ కొనియాడారు . సమ్మేళనాన్ని పురస్కరించుకొని పూర్వ విద్యార్థులు పేద స్టూడెంట్స్‌కు ప్రతి ఏటా ఆర్థిక సాయం చేస్తామని ప్రకటించారు. అనంతరం ఫ్రెండ్ షిప్ డే కేక్ కట్ చేసి ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఇనుగాల విజయ్ కుమార్, పబ్బు రమేష్ గౌడ్, మొగిలిచర్ల ప్రశాంత్, పులికంటి రాజేందర్, రమేష్, కిషన్, మౌటం మహేందర్, కిన్నెర రమేష్, నూక నాగరాజు, రేవంత్ కుమార్, సంతోష్ చక్రవర్తి, నిచ్చల, కల్పన, జ్యోతి, రాధిక, అశోక రాణి, కరుణ, గీత, తదితరులు ఉన్నారు.

మూగబోయిన ఉద్యమ గొంతుక

వరంగల్ వాయిస్, హనుమకొండ : మాదిగ రాజకీయ పోరాట సమితి, మహాజన పోరాట సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల ముద్దుబిడ్డ బీఎన్ రమేష్ కుమార్ మాదిగ ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ల్యాదెల్ల కుమార్ మాదిగ అధ్యక్షతన హనుమకొండ అంబేద్కర్ విగ్రహం ఎదుట తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొక్కల వెంకటస్వామి మాదిగ ముఖ్యఅతిథిగా ప్రజా యుద్ద నౌక గద్దర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ఉద్యమ గొంతుతో పాటలు పాడి ప్రజలను చైతన్య పరిచి రాష్ట్ర సాధనలో తన వంతు పాత్ర పోషించిన ప్రజా గాయకుడు గద్దర్ అన్న మరణించడం ఎంతో బాధాకరం అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ నాయకుడు పిల్లి క్రిస్టఫర్ మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇల్లందుల సుధాకర్ మాదిగ, రాష్ట్ర కార్యదర్శి రామంచ సారంగపాణి మాదిగ, రాష్ట్ర మీడియా కన్వీనర్ జేరిపోతుల విల్సన్ మాదిగ, వరంగల్ జిల్లా అధ్యక్షుడు సింగారపు చిరంజీవి మాదిగ, హనుమకొండ జిల్లా అధికార ప్రతినిధి సురేష్ మాదిగ, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి తక్కలపల్లి రాజు మాదిగ, ఎమ్మార్పీఎస్, ఎంపీ ఎస్ నాయకులు పోలపాక శ్రీనివాస్ మాదిగ, ఎండీ భాష పాల్గొన్నారు.

గద్దర్ మరణం బాధాకరం

వరంగల్ వాయిస్, శాయంపేట : ప్రజా గాయకుడు గద్దర్ కొన్ని దశాబ్దాల పాటు తన పాటల ద్వారా అణగారిన వర్గాల వారిని చైతన్యం చేశాదని, నేడు ఆయన లేకపోవడం తీరని లోటని టీపీసీసీ సభ్యుడు, భూపాలపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ గండ్ర సత్యనారాయణ రావు గారు అన్నారు. సోమవారం శాయంపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు గద్దర్ చిత్రపటానికి పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గండ్ర సత్యనారాయణ రావు పాల్గొని నివాళులు అర్పించారు. అనంతరం జీఎస్సార్ మాట్లాడుతూ ప్రజా యుద్ధనౌకగా పేరొందిన గద్దర్, పీపుల్స్ వార్ అనంతరం తెలంగాణ ఉద్యమాల్లో తన గళంతో కోట్లాది మంది ప్రజలను ఉత్తేజపరిచారని గుర్తు చేశారు. పేదింట్లో పుట్టిన గద్దర్ ప్రజల మనిషిగా ఎదిగి అందరి గుండెల్లో స్థానాన్ని సంపాదించుకున్నారని జీఎస్సార్ కొనియాడారు. ఈరోజు వారు మన మధ్యలో లేకపోవడం బాధాకరమని అన్నారు. వారి కుటుంబానికి ఆ భగవంతుడి దీవెనలు ఎల్లవేళలా ఉండాలని జీఎస్సార్ ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రెసిడెంట్ దూదిపాల బుచ్చిరెడ్డి, మండల ముఖ్య నాయకులు చిందం రవి, మారపెల్లి రాజేందర్, ఎండీ రఫీ, ఎండీ హైదర్, బాసాని మార్కండేయ, మారపెల్లి కట్టయ్య, కుక్కల భిక్షపతి, నగులగాని వీరన్న, కుక్కల విష్ణు, ఎండీ రియాజ్ తదితరులు ఉన్నారు.

న్యాయ వాదుల సంఘం నివాళి ..

వరంగల్ వాయిస్, హనుమకొండ : భారత న్యాయవాదుల సంఘం జిల్లా సమితి ఆధ్వర్యంలో సోమవారం ప్రజా పోరాట యోధుడికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఐఏఎల్ జాతీయ కార్యవర్గ సభ్యుడు, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు దుస్సా జనార్ధన్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల కోసం నిరంతరం పోరాటం చేస్తూ తన ఆటపాట మాటలతో ప్రజలను చైతన్యవంతం చేసి అన్యాయంపై తిరుగుబాటు బావుట ఎగురవేసిన గొంతుక మూగబోవడం తెలంగాణ ప్రజానీకానికి ఎంతో నష్టం అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం గజ్జె కట్టి, గంతులేసి ప్రజలను తెలంగాణ ఉద్యమం వైపు మళ్లించి తన పాటల ద్వారా తెలంగాణ సాధనలో ప్రముఖ పాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో భారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర కార్యదర్శి భీమనాదం శ్రీనివాస్, సీనియర్ న్యాయవాదులు తోకల జితేందర్ రెడ్డి, ఐఏఎల్ నాయకులు కొత్తపల్లి చిరంజీవి, కరుణాకర్, రమేష్, అనిల్, దేవేందర్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లకు అవగాహన సదస్సు

వరంగల్ వాయిస్, నడికూడ : కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన సూచనల మేరకు నడికూడ మండల రెవెన్యూ ఇన్ స్పెక్టర్ లవుడియా హేమానాయక్ ఆధ్వర్యంలో ఓటర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం ప్రదర్శన వాహనం ద్వారా మండలంలోని నర్సక్క పల్లి వెంకటేశ్వర్ల పల్లి కౌకొండ గ్రామాలలో వివిధ పోలింగ్ స్టేషనులకు వెళ్లి ప్రజలతో ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించారు. ఓటు వేయుట బ్యాలెట్ యూనిట్ లో నీలిరంగు బటన్ నొక్కి ఓటు వేయడం, ధ్రువీకరించుట ఓటు వేసిన తర్వాత పేపర్ స్లిప్ ను ధ్రువీకరించుకొవాలన్నారు. సంతృప్తి చెందుట మీరు వేసిన ఓటు మీరు ఎంచుకున్న అభ్యర్థికి పడినట్లు ధృవీకరించుకోవడం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఓటర్లు సంతోషంగా పాల్గొని వారి ఓటును ఏ విధంగా వేయాలో తెలుసుకోవడం జరిగింది. నేటితో నడికూడ మండలం కార్యక్రమం సంపూర్ణంగా విజయవంతంగా ముగిసిందని తెలిపారు. రేపటి నుంచి ఆత్మకూరు మండలంలో ప్రారంభం కానుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఎల్వోలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పిల్లలకు ముర్రుపాలు శ్రేయస్కరం

వరంగల్ వాయిస్, చెన్నారావుపేట: పుట్టిన బిడ్డలకు (ముర్రుపాలు) తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని ఉప్పరపల్లి-3 అంగన్వాడీ టీచర్ రజిత అన్నారు. మండలంలోని ఉప్పరపల్లి గ్రామం అంగన్వాడీ-3 సెంటర్ లో తల్లిపాల ప్రాముఖ్యతపై తల్లులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ రజిత మాట్లాడుతూ తల్లి ముర్రుపాలు పుట్టిన బిడ్డల్లో రోగ నిరోధక శక్తిని పెంచుతాయని తెలిపారు. అలాగే అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం బాలింతలకు, చిన్న పిల్లలకు పౌష్టికాహారాన్నిఅందిస్తుందని, ప్రతి ఒక్కరూ పౌష్టికాహారాన్ని తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. అనంతరం చిన్న పిల్లలకు పరిశుభ్రతపై ఆశావర్కర్ తో కలిసి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ విజయలక్ష్మి, ఆశ వర్కర్లు మాడుగుల లత, ఎండీ శాహీన్, అంగన్వాడీ ఆయాలు ఏ నీలమ్మ, రాయరాకుల కట్టమ్మ, శారద, పిల్ల తల్లులు, బాలింతలు పాల్గొన్నారు.

గద్దర్ చిత్రపటానికి ఘన నివాళులు

వరంగల్ వాయిస్, మహబూబాబాద్ : జిల్లా కేంద్రంలోని నెహ్రూ సెంటర్ లో ప్రజా గాయకుడు గద్దర్ అకాల మరణానికి చింతిస్తూ మహబూబాబాద్ అర్బన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గణపురపు అంజయ్య నేతృత్వంలో వారి చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గణపురపు అంజయ్య మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ ఆదేశాల మేరకు అన్ని జిల్లా కేంద్రాలలో, అన్ని మండల కేంద్రాలలో ప్రధాన కూడళ్లలో గద్దర్ చిత్రపటానికి కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నివాళులు అర్పించాలని పెద్ద ఎత్తున సంతాప కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చిన నేపథ్యంలో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గద్దర్ కు ఘన నివాళులు అర్పించడం జరిగిందని తెలిపారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ ఎస్టీ సెల్ రాష్ట్ర కో ఆర్డినేటర్ వెంకట్ నాయక్, కిసాన్ సెల్ అధ్యక్షుడు తోట వెంకన్న, ఎస్టీ సెల్ మాజీ జిల్లా అధ్యక్షుడు బానోత్ ప్రసాద్ నాయక్, బయ్యారం మండల పీఏసీఎస్ డైరెక్టర్ జూలకంటి సీతారాం రెడ్డి, రాంశెట్టి వీరేందర్, ఎన్ఎస్ యూఐ జిల్లా అధ్యక్షుడు రియాజ్ అన్సారీ, మహబూబాబాద్ మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు బాతుక స్వర్ణలత, విజయలక్ష్మి, రామరాజు ఉపేందర్ పటేల్, గండు కార్తీక్, ఖాజా పాషా తథితరులు పాల్గొన్నారు.

పరకాలలో..

వరంగల్ వాయిస్, పరకాల : తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ప్రజా నాయకుడు, ప్రజా యుద్ధనౌక గద్దర్ గారి అకాల మరణం పట్ల స్థానిక అమరధామంలో పరకాల శాసన సభ్యుడు చల్లా ధర్మారెడ్డి ఆదేశానుసారం బీఆర్ఎస్ పరకాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గద్దర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. గద్దర్ చిత్రపటానికి బీఆర్ఎస్ పరకాల పట్టణ అధ్యక్షుడు డాక్టర్. మడికొండ శ్రీను నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మడికొండ శ్రీను మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ కోసం తొలిదశ, మలిదశ ఉద్యమ సమయంలో విద్యార్థి, యువకులను ఉద్యమంలో భాగస్వాములను చేశారని, తన ఆట పాటలతో ఉద్యమానికి ఊపిరిపోసి, నాలుగు కోట్ల ప్రజలలో ఉద్యమచైతన్యాన్ని రగిలించిన గొప్ప వ్యక్తని అన్నారు.

ఘనంగా రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి..

వరంగల్ వాయిస్, పరకాల : భారత జాతీయ గీత రచయిత రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి కార్యక్రమంలో భాగంగా ఠాగూర్ చిత్రపటానికి బీఆర్ఎస్ పరకాల పట్టణ అధ్యక్షుడు మడికొండ శ్రీను పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా యుద్ధనౌక మరణం పూడ్చలేని లోటు

వరంగల్ వాయిస్, కన్నాయిగూడెం : తెలంగాణ ఉద్యమాన్ని గజ్జ కట్టి తన ఆట పాట మాట ద్వారా ఉగ్రూతలూగించిన గుమ్మడి విఠల్ రావు ఆకస్మిక మరణం తెలంగాణకు తీరని లోటని వైఎస్సార్ తెలంగాణ పార్టీ కన్నాయిగూడెం మండల అధ్యక్షుడు కలవచర్ల భిక్షపతి అన్నారు. ఎన్నో సామాజిక ఉద్యమాలను ముందుండి నడిపించి" పాటనై వస్తానమ్మో మాటనై వస్తానమ్మో దోపిడీ వర్గాల గుండెల్లో బాకునై వస్తానమ్మో " అంటూ నినదించిన ధిక్కార స్వరం పీడిత తాడిత జనుల సొంత గళం గద్దర్ మరణం తెలుగు నేలకు, సంబంధ వర్ణాలకు తీరని, తీర్చలేని పూడ్చలేని లోటు.తెలంగాణ ఉన్నంత వరకు, విప్లవోద్యమాలు ఉన్నంత వరకు జనం గుండెల్లో మీ పాట ఎప్పుడూ స్ఫూర్తి నిస్తూనే ఉంటుంది. ఆ భగవంతుడు వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం ఓదార్పును ప్రసాదించాలని కోరుకున్నారు.

13న కోరుట్ల పద్మశాలి రాజకీయ యుద్ధభేరీ

వరంగల్ వాయిస్, నడికూడ : జాతీయ చేనేత దినోత్సవ ఉత్సవాల్లో భాగంగా పరకాల మండల పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు దాసరి భిక్షపతి ఆధ్వర్యంలో చేనేత కార్మికులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. నాగారం చేనేత సొసైటీ కార్మికులకు, వెల్లంపెల్లి చేనేత సొసైటీ కార్మికులకు, రాయపర్తి చేనేత సొసైటీ కార్మికులకు, చెర్లపల్లి చేనేత సొసైటీ కార్మికులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. అనంతరం ఆగష్టు 13 చలో కోరుట్ల పద్మశాలి రాజకీయ యుద్ధభేరీ సభ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీసీసీ, చేనేత సెల్ జయశంకర్ భూపాలపల్లి నేత ఆడెపు సంపత్, నడికూడ మండలం పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు గాదె శంకరయ్య, పరకాల మండల పద్మశాలి సేవా సంఘం ఉపాధ్యక్షుడు దానం నిరంజన్, నడికూడ మండల ప్రధాన కార్యదర్శి రమేష్, పరకాల మండల పద్మశాలి సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు ఐతే సాంబయ్య, రాయపర్తి మాజీ సర్పంచ్ కడారి సమ్మయ్య, నాగారం పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు మెండు కృష్ణమూర్తి, నాగారం చేనేత సొసైటీ చైర్మన్ క్యాతం రాజసమ్మయ్య, బొద్దుల రాజయ్య, వెల్లంపెల్లి చేనేత సొసైటీ చైర్మన్ గడ్డం చంద్రమౌళి, పోచారం పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు, గడ్డం విజయ్ కుమార్, మేర్గు సంతోషం, మంత్రి శ్రీనివాస్, దుబాసి సదానందం, మేర్గు నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పరకాల పద్మశాలి భవనంలో ఏర్పాటు చేసిన జాతీయ చేనేత దినోత్సవ ఉత్సవాల్లో పాల్గొన్నారు.

సమస్యలు వెంటనే పరిష్కరించాలి

వరంగల్ వాయిస్, చెన్నారావుపేట : మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ అయిన చెన్నారావుపేట గ్రామంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ మండల కార్యదర్శి పత్తి అనంత్ రెడ్డి అన్నారు. గ్రామం ప్రధానంగా గ్రామపంచాయతీ భవనం పూర్తి కాక వాటర్ ప్లాంట్ లేక, రోడ్డు వెడల్పు పనులలో గ్రామపంచాయతీ పాలకవర్గం, అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు అధికారులు చొర తీసుకొని వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల నాయకుడు గుగులోతు నరసింహ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ

వరంగల్ వాయిస్, కాజీపేట : కాజీపేట రిటైర్డ్ రైల్వే ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో 47వ డివిజన్ కార్పొరేటర్ సంకు నర్సింగరావు పుట్టినరోజు సందర్భంగా బాపూజీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 50మంది పిల్లలకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 47వ డివిజన్ కార్పొరేటర్ మాట్లాడుతూ నా పుట్టినరోజు సందర్భంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేసిన రైల్వే రిటైర్డ్ ఎంప్లాయిస్ డీజిల్ కాలనీ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గబ్బేట శ్రీనివాస్, మాజీ డివిజన్ అధ్యక్షుడు నయీమ్ జుబేర్, రిటైర్డ్ రైల్వే ఎంప్లాయిస్ డీజిల్ కాలనీ సభ్యులు పి.సమ్మయ్య, జి.నాగరాజు, బి.సమ్మయ్య,ఎస్.వెంకటేశ్వర్లు, జి.జగదీశ్వర్, వి.కుమారస్వామి, జె.యాదగిరి, పి.లోకనాథం, వక్కల.కుమార్ స్వామి, బి.ఐలయ్య, ఎస్.నరసయ్య, పి.నరసయ్య పాల్గొన్నారు.

పోచమ్మ దేవాలయంలో ఎమ్మెల్యే అరూరి పూజలు

వరంగల్ వాయిస్, వరంగల్ : గ్రేటర్ వరంగల్ 43వ డివిజన్ సత్య సాయి నగర్ లో నిర్మించిన శ్రీ పోచమ్మ దేవాలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకల్లో బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. స్థానిక డివిజన్ కార్పొరేటర్, డివిజన్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

తెలంగాణలో క్రీడలకు అధిక ప్రాధాన్యం

కుడా చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్

2nd TELANGANA STATE JAVELIN THROW 100 M & 400 M ATHLETICS CHAMPIONSHIP
To Commemorate the Victory of NEERAJ C A in Javelin by Winning the First Olampic Gold Med
for India in Athletics ya Olampics on 7th August,2021
2nd NATIONAL JAV DAY CHAMPIONSHIP-2023
HANUMAKON ATHLETICS ASSOCIATIO

వరంగల్ వాయిస్, హనుమకొండ : గ్రామస్థాయి నుంచి క్రీడాకారుల ప్రోత్సాహానికి గ్రామాల్లో క్రీడా మైదానాల ఏర్పాటు చేస్తామని కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్ రాజ్ యాదవ్ అన్నారు. హనుమకొండ లోని జేఎన్ఎస్ స్టేడియంలో సోమవారం నిర్వహించిన తెలంగాణ స్టేట్ లెవెల్ సెకండ్ జావలిన్ త్రో 100 మీటర్స్, 400 మీటర్స్ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ మీట్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై కుడా చైర్మన్ సంగం రెడ్డి సుందర్ రాజ్ యాదవ్ మాట్లాడారు. క్రీడలు విద్యార్థుల్లో మానసిక వికాసానికి దోహదపడతాయని తెలిపారు. క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి తెలంగాణకు పేరు తీసుకురావాలన్నారు. క్రీడాకారులకు ప్రోత్సాహం అందించడంలో తెలంగాణ ప్రభుత్వం ఎప్పుడు ముందుంటుందని తెలిపారు. స్టేట్ లెవెల్ మీట్ ను హనుమకొండ అథ్లెటిక్ అసోసియేషన్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో సారంగపాణి, యుగేందర్ రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, చంద్రమోహన్ గౌడ్, మహీధర్, సమ్మయ్య, మనోజ్, కోచ్ లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పేదలకు భూమి హక్కు పత్రాలు ఇవ్వాలి

MRO ఆఫీస్ ఎదుట ధర్నా
CPM

వరంగల్ వాయిస్, మహబూబాబాద్ : ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు ఇంటి స్థలాలు, రెండు పడక గదుల ఇండ్లు ఇవ్వాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరుపేదలు ఆందోళన నిర్వహించారు. తొలుత భారీ ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేక నినాదాలతో పేదలు కార్యాయలయ ప్రాంతాన్ని హొరెత్తించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నపేదల గుడిసెలు కూల్చివేసి ఆ స్థలాల్లో ప్రభుత్వ కార్యాలయాలు, దోబీ ఘాట్ లు నిర్మించడం దుర్మార్గమన్నారు. బడా బాబులు, అధికార పార్టీ నేతలు ప్రభుత్వ భూములను కబ్జా చేసి రియల్ దందా చేసుకొని కోట్ల రూపాయలు ఆర్జిస్తుంటే వారి జోలికి పోనీ అధికారులు పేదవాడు 70గజాల భూమిలో గుడిసె ఏసుకుంటే కూల్చడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్నపేదలకు భూమి హక్కు పత్రాలు ఇచ్చి రెండు పడక గదుల ఇండ్ల నిర్మాణం చేపట్టాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, సీపీఎం మున్సిపల్ ఫ్లోర్ లీడర్, పార్టీ నేతలు వెంకన్న, మహేష్ పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి

వరంగల్ వాయిస్, తొర్రూరు: స్థానిక మున్సిపల్ కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద గత 32రోజుల నుంచి సుదీర్ఘంగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న గ్రామపంచాయతీ సిబ్బందికి హ్యూమన్ రైట్స్ తొర్రూరు కమిటీ ఆధ్వర్యంలో అధ్యక్షుడు మంగళ పెల్లి హుస్సేన్ విచ్చేసి సంఘీభావం తెలిపారు. వారిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, గ్రామపంచాయతీ సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కరించి, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజేషన్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతేకాకుండా కరోనా సమయంలో ప్రాణలు సైతం లెక్కచేయకుండా కష్టపడి జయించిన ఘనత వారికే దక్కుతుందని వారి సేవలను కొనియాడారు. వారి శ్రమ ఫలితంగా ఈరోజు స్లీపర్ కు రూ.15,600, కారోబార్లకు రూ.19500 ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అంతేకాకుండా ప్రమాదవశాత్తు మరణిస్తే వారికి పది లక్షలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇచ్చి వారిని ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సోషల్ జస్టిన్ అధ్యక్షుడు ఒగ్గ అమరేందర్, తెలంగాణ స్టేట్ ట్రెజరర్ శ్రీరాం నవీన్, రాష్ట్ర కమిటీ మెంబర్ గంధం లాలయ్య, మహబూబాబాద్ సోషల్ సర్వీస్ ప్రెసిడెంట్ గార వీరస్వామి, జిల్లా కమిటీ సభ్యులు నవీన్, రమేష్, ఉమేష్, శ్రీనివాస్, చర్లపాలెం శ్రీనివాస్, అధ్యక్షులు, అమ్మపురం కానాపురం, మడిపల్లి, చిన్నవంగర సిబ్బంది పాల్గొన్నారు.

చేనేతలకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం

వరంగల్ వాయిస్, వరంగల్ : జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా 23వ డివిజన్ కోత్తవాడ చేనేత పారిశ్రామిక సంఘంలో 23వ డివిజన్ మాజీ కార్పొరేటర్, బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి యెలుగం లీలావతి సత్యనారాయణ ఆధ్వర్యంలో చేనేత కార్మికులతో కలిసి జాతీయ చేనేత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులకు యెలుగం లీలావతి సత్యనారాయణ శాలువాలతో సత్కరించి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యెలుగం లీలావతి సత్యనారాయణ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం నేతన్నలను అన్ని విధాల అదుకుంటుందని, కొత్తవాడ చేనేత కార్మికుల సమస్యలు స్థానిక శాసన సభ్యుడు నన్నపునేని నరేందర్ చొరవతో మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకువెళ్లడంతో పాటు వాటిని తీర్చి చేనేత కార్మికులకు చేతి నిండా పని కల్పిస్తున్నారని అన్నారు. నేతన్నలకు బీఆర్ఎస్ ప్రభుత్వం చేనేత బీమా వంటి గొప్ప పథకం ప్రవేశ పెట్టిందని, గత చరిత్రతో పోలిస్తే చేనేత కార్మికుల కష్టాన్ని తీర్చిన ఒకే ఒక ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ యెలుగం రవిరాజు, 23వ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ పరిశీలకుడు బేతి అశోక్, డివిజన్ అధ్యక్షుడు బోల్లు సతీష్, యువజన నాయకులు ఏల్పుల సునీల్ యాదవ్, భాషకర్ల హరిక్రిష్ణ పటేల్, డివిజన్ ఉపాధ్యక్షుడు లక్కర్స్ మొగిళి, యూత్ అధ్యక్షుడు కోత్తపెల్లి వినయ్, ఆడెపు నగేష్ నేత, చేనేత కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు కాంగ్రెస్ హామీలు

వరంగల్ వాయిస్, హనుమకొండ : వరంగల్ పశ్చిమ నియోజగవర్గంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కొడిపాక గణేష్ ఆధ్వర్యంలో సోమవారం యూత్ కాంగ్రెస్ డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రేపల్లె శ్రీ రంగనాథ్ పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి యూత్ కాంగ్రెస్ వెన్నెముక లాంటిదని బూత్ స్థాయిలో పని చేయడంలో యువజన కాంగ్రెస్ నాయకులు ముందుండాలన్నారు. కాంగ్రెస్ హామీలను గడప గడపకు తీసుకెళ్లాలని , బీఆర్ఎస్, బీజేపీల మోసాలను వివరించాలన్నారు. కాంగ్రెస్ గెలుపు కోసం ఈ నాలుగునెలలు మనందరం నిరంతరం శ్రమించాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో వరంగల్ పశ్చిమ లో కాంగ్రెస్ పార్టీ జెండాను కచ్చితంగా ఎగరవేద్దామని భరోసా ఇచ్చారు. యువజన కాంగ్రెస్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న డోర్ టు డోర్ క్యాంపెయిన్ ను ప్రతి డివిజన్ లో చేయాలని, విత్ ఐవైసీ యాప్ ద్వారా ప్రతి గడప గడప వివరాలు నమోదు చేయాలని, రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలలో ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. పనిచేసే ప్రతి ఒక్క యూత్ కాంగ్రెస్ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. కర్ణాటక రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి యూత్ కాంగ్రెస్ ముఖ్య పాత్ర పోషించిందని తెలిపారు. డోర్ టు డోర్ కార్యక్రమంలో రాష్ట్రం లోనే వరంగల్ అర్బన్ జిల్లాను ముందుంచుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 47వ డివిజన్ కాంటెస్ట్ కార్పొరేటర్ సందుల విజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రావుల విద్యాసాగర్, గంగుల రాజిరెడ్డి, సత్యవరం మధుకర్, అశోక్, 47వ డివిజన్ యూత్ ప్రెసిడెంట్ ఇమ్మడి నాగరాజు, 4వ డివిజన్ యూత్ ప్రెసిడెంట్ సంజయ్, అఫ్రోజ్, యాకుబ్, సురేందర్ ఆకారపు, శివాజీ రమేష్, దాస్ రాజు, లాలు, మహేష్, రబ్బాని, అఖిల్, బన్నీ, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం

వరంగల్ వాయిస్, వరంగల్ : ఉర్సు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1997-98 పదో తరగతి అభ్యసించిన పూర్వ విద్యార్థిని విద్యార్థులు ఆదివారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయుడు కుర్ర రమేష్ బాబు సభా అధ్యక్షత వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా ఉపాధ్యాయ బృందం హాజరయ్యారు పాఠశాల ప్రస్తుత హెచ్ఎం రమేష్ బాబు మాట్లాడుతూ మీరందరూ 25 వసంతాలు పూర్తి చేసుకొని ఈరోజు పాఠశాలలో విద్యార్థులు అందరూ కలిసి పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమం చేసుకుంటున్నారంటే గొప్ప విషయమని అన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులను పూల మొక్క, శాలువాలతో సత్కరించారు. అనంతరం విద్యార్థులు పాఠశాలలో చదువుకున్న అనుభవాలను గుర్తు చేసుకుంటూ ఉపన్యాసాలు ఇచ్చారు. విద్యార్థులు విద్యార్థినులకు సోదరి భావంతో చీరలను బహుకరించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందిస్తూ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో చదువు నేర్పిన గురువులు శారదాబాయి, శ్యాంసుందర్, దున్నాల శ్రీనివాసరావు, ప్రకాష్, టీ ప్రభాకర్, రాజేందర్, చంద్రమోహన్, రవీందర్, రాజిరెడ్డి, పూర్ణ చందర్, వెంకటరమణ, ఆకుతోట శ్రీనివాస్, ఉర్దూ కాజా మొహీనుద్దీన్, ఇస్మాయిల్, హైమద్ ఖాన్, మున్వర్, గజాల యాస్మిన్ కార్యక్రమంలో పాఠశాలలో చిన్ననాటి మధుర జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. 50 మంది విద్యార్థులు విద్యార్థులు అందరూ కలిసి ఆట పాటలతో చిందులేస్తూ ఆనందోత్సవాలు పంచుకున్నారు.

మైనార్టీ బంధులో కొత్తవారికి అవకాశం కల్పించాలి

వరంగల్ వాయిస్, తొర్రూరు : మైనార్టీ జిల్లా నాయకులు మహమ్మద్ అమీర్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీలకు ప్రవేశపెట్టిన మైనార్టీ బంధు దరఖాస్తులు చేసుకోవడానికి ఆప్షన్ లాగిన్ ను తక్షణమే ఓపెన్ చేయాలని తొర్రూరు గ్రీవెన్స్ సెల్ లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మైనార్టీ జిల్లా నాయకులు మహమ్మద్ అమీర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్ రావు మైనార్టీల సంక్షేమం కోసం పేద, అర్హులైన ముస్లిం మైనార్టీలకు ఇటీవల లక్ష రూపాయల మైనార్టీ బంధు ఇవ్వడం జరుగుతుందని ప్రకటించి వారం రోజులు గడుస్తున్నప్పటికీ, ఇంతవరకు దరఖాస్తు చేసుకోవడానికి ఆన్ లైన్ లో ఆప్షన్ లాగిన్ ఓపెన్ కాకపోవడంతో లోన్ కు అర్హులైన పేద ముస్లిం సోదరీ సోదరీమణులు అయోమయానికి గురవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేద, మధ్య తరగతి ముస్లింలు మైనార్టీ బంధును దరఖాస్తు చేసుకోవడానికి మరోసారి అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు మహమ్మద్ గఫార్, మహమ్మద్ గని, మహమ్మద్ జఫిరుద్దీన్, మహమ్మద్ సైదుల్లా, యాకూబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

వరంగల్ వాయిస్, ధర్మసాగర్ : వేలేరు మండల కేంద్రంలో ఇటీవల మోతె ఎల్లయ్య(మహరాజ్) మరణించారు. సోమవారం ఆయన దశదినకర్మ నిర్వహించగా వారి కుటుంబానికి 25 కేజీల బియ్యాన్ని వేలేరు ఉపసర్పంచ్ సద్దాంహుస్సేన్ అందించారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ బైరి అనిల్, యూత్ అధ్యక్షుడు అక్కల ప్రశాంత్, కుమార స్వామి, నవీన్, సలీం మాలిక్, శ్రీకాంత్, ఆసిఫ్, పూర్ణచందర్, శ్రీనివాస్, కుల సంఘ పెద్దలు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు సన్మానం

వరంగల్ వాయిస్, వరంగల్ : రామన్నపేటలోని డాక్టర్ ఏ రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకొని వరంగల్ కొత్తవాడలోని నివాసం ఉంటూ చేనేతపై ఆధారపడి జీవనం సాగిస్తున్న కల్లపల్లి రాజ సమ్మయ్య, పెండెం పోషాలు, కళ్లెపెల్లి లక్ష్మి లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ ట్రస్టీ మాట్లాడుతూ గత 50ఏళ్లుగా చేనేతపై జీవనోపాధి పొందుతూ జీవనం సాగిస్తున్నా వారికి కష్టాలు మాత్రం తీరడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్ట్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ తో పాటు కోఆర్డినేటర్ మోహన్ వారణాసి ఆర్గనైజర్ శ్రవణ్, శారద, లింగమూర్తి, శంకర్, తాగటం రాము, చందర్, హరికృష్ణ, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి గండ్ర పరామర్శ

వరంగల్ వాయిస్, శాయంపేట : మండలంలోని మాందారి పేట గ్రామానికి చెందిన అల్లం రాజ కొమురయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా సోమవారం ఎమ్మెల్యే కంట్రీ వెంకటరమణారెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. రోడ్డు ప్రమాదానికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ గొట్టిముక్కుల స్వాతి విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ సర్పంచులు జిన్నా రాజేందర్, రేణిగుంట్ల సదయ్య, ఉప సర్పంచ్ సుమన్ తదితరులు ఉన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

వరంగల్ వాయిస్, సుబేదారి : నగరంలోని సుబేదారి రెడ్ క్రాస్ భవన్ లో హిరోషిమా డే సందర్భంగా సోమవారం లయన్స్ క్లబ్ భీమారం ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, హనుమకొండ వైస్ చైర్మన్ లయన్ పెద్ది వెంకటనారాయణ గౌడ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో రెడ్ క్రాస్ హనుమకొండ కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, పూర్వ జిల్లా లయన్ గవర్నర్, జిల్లా పాలకవర్గ సభ్యులు పొట్లపల్లి శ్రీనివాస్ రావు, క్లబ్ అధ్యక్షుడు లయన్ డా.జి.రామసుధాకర్, మోత్కూరు మనోహర్ రావు, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

కండ్లు ఉంటే బుడగ జంగాల కాలనీ చూడు..

మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి

వరంగల్ వాయిస్, పరకాల : కండ్లు ఉంటే బుడగ జంగాల కాలనీ చూడాలని మాజీ ఎమ్మెల్యే ములుగు భిక్షపతి పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని డిమాండ్ చేశారు. సోమవారం పరకాల పట్టణంలోని ఆరో వార్డు పరిధిలోని బుడగ జంగాల కాలనీని ఆయన బీజేపీ పరకాల పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి ఆధ్వర్యంలో పరిశీలించారు. పరిశీలన అనంతరం మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి మాట్లాడుతూ పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి పరకాల కాలనీలు ఎక్కడ ఉన్నాయో తెలియదని, పరకాల ఏమాత్రం అభివృద్ధి చెందలేదని అన్నారు. బుడగ జంగాల కాలనీలో ఎన్నికల సమయంలో ఓట్ల కోసం ఎమ్మెల్యే తిరగడం తప్ప గెలిచిన తర్వాత ఏ ఒక్కనాడు బుడగ జంగాలు కాలనీ పట్టించుకోలేదని, వారి జీవన విధానం కడు దుర్భరంగా ఉందని అన్నారు. పరకాల ఎమ్మెల్యే అభివృద్ధి ప్రదాత అని తన అనుచరులతో చెప్పించుకొని సంబరపడుతున్నాడని, తన సమావేశాలకు డ్వాక్రా మహిళలను, తన అనుచరులు వచ్చి ఎమ్మెల్యే మాటలకు చప్పట్లు కొట్టి ఎమ్మెల్యేను మెచ్చుకుంటున్నారని, పరకాల నిజమైన పరిస్థితులు ఎమ్మెల్యేకు తెలియదని ఎద్దేవా చేశారు. పరకాలలో పలు కాలనీలను ఎమ్మెల్యే తక్షణమే పరిశీలించి వారికి డబుల్ బెడ్రూంలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే స్పందించకుంటే బీజేపీ పక్షాన కాలనీలలో ప్రజలందరితో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో, మున్సిపల్ కార్యలయంలో నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కౌన్సిలర్లు భద్రయ్య, పుర్ణా చారి, సంగ పురుషోత్తం, దుబాసి వెంకటస్వామి, ఆకుల రాంబాబు, సురంపెల్లి సమ్మయ్య, లక్క సతీష్, బలభద్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన జీఎస్సాఆర్

వరంగల్ వాయిస్, శాయంపేట : మండల కేంద్రంలో వంగర్ శంకర్, మార్త వెంకటయ్య, ప్రగసింగారం గ్రామంలో మూడు కుంట్ల రణధీర్, కొప్పుల గ్రామంలో బగ్గి సాంబయ్యలు ఇటీవల మృతిచెందగా సోమవారం కాంగ్రెస్ భూపాలపల్లి నియోజకవర్గ ఇంచార్జి గండ్ర సత్యనారాయణ రావు మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, అధికార ప్రతినిధి చిందంరవి, ఎండీ వలి, హైదర్ ఉన్నారు.

వరంగల్ వాయిస్
సినిమా
సోమవారం 07,
ఆగస్టు 2023

9న ఖుషీ ట్రైలర్..

విజయ్ దేవరకొండ, సమంత జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'ఖుషి '. నిన్ను కోరి, మజిలీ, టక్ జగదీష్ చిత్రాల ఫేమ్ శివ నిర్వాణ ఈ చిత్రానికి దర్శకుడు. మైత్రీ మూవీ మేకర్ సంస్థ నిర్మిస్తున్నది. ఈ సినిమా చిత్రీకరణ పూర్తికాగా.. సెప్టెంబర్ 1న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేశారు. ఇప్పటికే మేకర్స్ ఈ సినిమా నుంచి విడుదల చేసిన ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్‌తోపాటు 'నా రోజా నువ్వే' 'ఆరాధ్య' 'ఖుషి' అంటూ సాగే పాటలకు సోషల్‌మీడియాలో మంచి స్పందన లభిస్తున్నది. ఇదిలా ఉండగా.. తాజాగా ఈ సినిమా ట్రైలర్ అప్‌డేట్‌ను మేకర్స్ ప్రకటించారు. ఎప్పుడెప్పుడా అని విజయ్, సమంత ఫ్యాన్స్ వేయి కళ్లతో ఎదురు చేస్తున్న ట్రైలర్ అప్‌డేట్ వచ్చేసింది. ఆగష్టు 9న ఈ సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేయబోతున్నట్లు విజయ్ దేవరకొండ సోషల్ మీడియాలో వెల్లడించాడు. ఈ ట్రైలర్ 2 నిమిషాల 41 సెకన్ల నిడివి ఉందంటూ విజయ్ ట్విట్టర్‌లో తెలిపాడు. అంతకుముందు ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌కు సీబీఎఫ్‌సీ 'యూ' సర్టిఫికేట్ ఇచ్చినట్లు విజయ్ తెలిపిన విషయం తెలిసిందే.

అభిమానిని కూల్ చేసిన తమన్నా..

సెలబ్రెటీలు బయటకు వెళ్తే ఎవరో ఒకరు సెల్ఫీ అని లేదా మరేదైనా కారణం చెప్పి దగ్గరకు వచ్చి మాట్లాడేందుకు, టచ్ చేసేందుకు ప్రయత్నిస్తూ ఉంటారు. ముఖ్యంగా హీరోయిన్స్ బౌన్సర్‌లు లేకుండా బయటకు అడుగు కూడా పెట్టలేని పరిస్థితి ఉంటుంది. చుట్టూ ఎంత మంది బౌన్సర్ లు ఉన్నా కూడా కొన్ని సార్లు హీరోయిన్స్ కి అభిమానుల నుంచి చేదు అనుభవం ఎదురవుతూనే ఉంటుంది. తాజాగా మిల్కీ బ్యూటీ తమన్నాకు అదే పరిస్థితి ఎదురైంది. ఒక కార్యక్రమంకు హాజరు అయిన మిల్కీ బ్యూటీ తమన్నా ను ఫ్యాన్ ఒకరు దూసుకు వచ్చి పట్టుకున్నాడు. ఆమె చేయి పట్టుకోవడంతో పాటు ఆమెతో మాట్లాడేందుకు ప్రయత్నించాడు. ఒక్కసారిగా తమన్నా షాక్ అయినట్లుగా ఫేస్ పెట్టింది. అంతే కాకుండా ఆమె భపడింది. బారీకేడ్లు దూకి వచ్చిన అభిమానిని బౌన్సర్ లు తోసేందుకు ప్రయత్నించారు. కానీ అప్పుడు తమన్నా అతడిని దగ్గరకు పిలిచింది. కూల్ అవ్వు.. కాస్త నవ్వు అంది. అంతే కాకుండా అతడికి సెల్ఫీ కూడా ఇవ్వడంతో పాటు అతడితో కూల్ గా వ్యవహరించింది. తమన్నా చేసిన పని ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇలా వ్యవహరించడం కొద్ది మందికే సాధ్యం అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. తమన్నా మంచి మనసుకు ఇది నిదర్శనం అంటూ ఫ్యాన్స్ మాట్లాడుకుంటున్నారు. ఇక ఈ అమ్మడి సినిమాల విషయానికి వస్తే భోళా శంకర్ సినిమాతో చిరంజీవితో కలిసి ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. మరో వైపు తమిళ్ సూపర్ స్టార్ రజినీకాంత్ జైలర్ సినిమాలో కూడా ఈమె నటించింది. ఈ రెండు సినిమాలు భారీ విజయాన్ని సొంతం చేసుకుంటాయనే నమ్మకంతో తమన్నా కనిపిస్తుంది. ఒకేసారి ఈ సినిమాలు విడుదల కాబోతున్నాయి.

సెకండ్ సీజన్‌కు రెడీ..

విక్టరీ వెంకటేష్ రానా ఇద్దరు దగ్గుబాటి హీరోలు కలిసి చేసిన వెబ్ సీరీస్ రానా నాయుడు. నెట్ ప్లిక్స్ వారు నిర్మించిన ఈ సీరీస్ నార్త్ సైడ్ ఆడియన్స్‌ని బాగా మెప్పించింది. కొద్దిగా అడల్ట్ డోస్ ఎక్కువైందన్న కామెంట్స్ వచ్చినా అది హిందీ ఆడియన్స్ యాక్సెప్ట్ చేశారు. అయితే తెలుగులో వెంకటేష్ కి ఉన్న ఇమేజ్ వల్ల రానా నాయుడు సీరీస్ లో ఆ పాత్రను డైజెస్ట్ చేసుకోలేకపోయారు. అయితే రానా నాయుడు సీజన్ 1 సూపర్ సక్సెస్ అవడంతో సీజన్ 2ని కూడా త్వరలో ప్రేక్షకుల ముందుకు తెచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. రానా నాయుడు సీజన్ 2 సినిమా కోసం వెంకటేష్, రానా రెమ్యునరేషన్ ఎక్కువ డిమాండ్ చేసినట్టు తెలుస్తుంది. సీజన్ 1 హిట్ అవడం ఒక రీజన్ కాగా సీరీస్ కి ప్రేక్షకులలో ఉన్న డిమాండ్ మేరకు వారు రెమ్యూనరేషన్ పెంచమని అడిగారట. అసలైతే వెబ్ సీరీస్ ల రెమ్యూనరేషన్ ఇన్ని సీజన్స్ కి ఇంతా అని మాట్లాడుకుంటారు. అయితే కొంతమంది మాత్రం సీజన్ సీజన్ కి రెమ్యునరేషన్ డిసైడ్ చేస్తారు. రానా నాయుడు సీజన్ 2 కోసం నెట్ ప్లిక్స్ దగ్గుబాటి హీరోలు అడిగిన రెమ్యునరేషన్ ఇచ్చేందుకు ఓకే చెప్పారట. సీజన్ 1 తరహాలోనే సీజన్ 2 కూడా అదే రేంజ్ లో ఉంటుందని తెలుస్తుంది. రానా నాయుడు వెబ్ సీరీస్ సీజన్ 2 2024 జనవరిలో స్ట్రీమింగ్ అవుతుందని తెలుస్తుంది. ఇక రానా వెంకటేష్ సినిమాల విషయానికి వస్తే వెంకటేష్ శైలేష్ కొలను డైరెక్షన్ లో సైంధవ్ సినిమా చేస్తున్నాడు. రానా త్రివిక్రమ్ తో హిరణ్యకశ్యప సినిమా ప్రయత్నాల్లో ఉన్నాడు. సినిమాల లెక్క ఎలా ఉన్నా రానా నాయుడితో డిజిటల్ లో కూడా దగ్గుబాటి హీరోలు తమ సత్తా చాటారని చెప్పొచ్చు. వెంకటేష్ కి కొత్తేమో కానీ ఆల్రెడీ రానా హిందీలో కూడా సినిమాలు చేస్తుండటం వల్ల రానా నాయుడు వెబ్ సీరీస్ రానాకు బాలీవుడ్ లో బాగా ప్లస్ అయ్యింది.



గ్రాండ్‌గా భోళాశంకర్ ప్రీ ఈవెంట్

మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటించిన తాజా చిత్రం భోళా శంకర్. ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రావడానికి రెడీ అయ్యింది. మరో మూడు రోజుల్లో ఈ భోళా శంకరుడు థియేటర్స్ లో సందడి చేయనున్నాడు. మూవీ విడుదలకు దగ్గరపడుతుండటంతో, చిత్ర బృందం నిన్న హైదరాబాద్ లో గ్రాండ్ గా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ ప్రోగ్రామ్ బాగా సక్సెస్ అయ్యింది. చిరంజీవి, కీర్తి సురేష్ , సుశాంత్ అందరూ హాజరయ్యారు. అయితే, తమన్నా లేని లోటు స్పష్టంగా కనపడింది. తమన్నా కూడా హాజరై ఉండి ఉంటే, షోకి మరింత గ్లామర్ వచ్చి ఉండేది. కానీ, తమన్నా ఎందుకు రాలేదా అనే చర్చ మొదలైంది. ఆమె రాకపోవడానికి కారణం ఉందట. కరెక్ట్ గా భోళా శంకర్ ఈవెంట్ సమయంలో ఆమె ముంబయిలో మరో ఈవెంట్ లో హాజరుకావాల్సి వచ్చిందట. ప్రముఖ మేకప్ ఆర్టిస్ట్ ఎలోరియన్ హురెల్ ముంబయిలో మొట్టమొదటి సారిగా సెలూన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి తమన్నా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అందుకే భోళా శంకర్ ఈవెంట్ కి తమన్నా రాలేకపోయారు. అయితే, ఆ ఈవెంట్ లో తమన్నా బ్లాక్ కలర్ సూట్ లో మెరిసిపోయింది. ఆ ఫోటోలు ప్రస్తుతం వైరల్ గా మారాయి. ఇక,ఈ భోళా శంకర్ మూవీ ఆగస్టు 11వ తేదీన ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ మూవీలో అన్నా, చెలెళ్ల సెంటిమెంట్ ని హైలెట్ గా చూపించనున్నారు. కీర్తి సురేష్, చిరంజీవి కి చెల్లిలిగా కనిపించనుంది. ఇక ఈ మూవీలో సుశాంత్ కీలక పాత్రలో నటించారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఇదిలా ఉండగా, ఈ మూవీ తర్వాత చిరు కళ్యాణ్ కృష్ణ డైరెక్షన్ లో ఓ సినిమా చేస్తున్నారు. ఈ మూవీ అధికారిక ప్రకటన చిరంజీవి పుట్టినరోజు నాడు ప్రకటించే అవకాశం ఉంది. ఈ సినిమాలో సిద్దు జొన్నలగడ్డ కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలుస్తోంది. గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై చిరంజీవి పెద్ద కూతురు సుష్మిత ఈ చిత్రాన్ని నిర్మిస్తుండటం విశేషం.

గద్దర్‌కు ఘన నివాళి..

వరంగల్ వాయిస్, హనుమకొండ : ప్రజా యుద్ధ నౌక గద్దర్ కు నగరంలో పలువురు ఘనంగా నివాళులర్పించారు. కళాకారులు పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని గోపాల స్వామి గుడి జంక్షన్ లో సోమవారం జేబీ కల్చరల్ ఆర్ట్స్ జడల శివ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజ యుద్ధనౌక, ప్రజాకవి గద్దర్ సంస్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు రాజనాల శ్రీహరి విచ్చేసి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. గద్దర్ త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో జడల హరిత శివ, కళా రాజేశ్వరరావు, సిరబోయిన రాజు, విప్పనపల్లి రవికుమార్, జనగం రాజు, జన్ను మాణిక్యం, మటువాడ కుమార్ తో పాటు పలువురు కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మమైదాన్ జంక్షన్‌లో..

తమ పాటలతో తెలంగాణా ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగసేలా చేసిన ధీరుడు ప్రజా యుద్ధ నౌక, గాయకుడు గద్దర్ గొంతు మూగ బోవడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు పోచమైదాన్ సెంటర్ లో గద్దర్ చిత్ర పటానికి పూల మాల వేసి కొవ్వోత్తులతో ఘనమైన నివాళులు అర్పించారు. గద్దర్ అమర్ రహే అంటూ నినదించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ డెలిగేట్ నల్గొండ రమేష్, టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్, వరంగల్ సిటీ మహిళా ప్రెసిడెంట్ నారగొని స్వప్న మురళి గౌడ్, గిరి పుష్ప, విజయక్క, దాసరి రాజేష్, సయ్యద్ వసీమ్, ఎం.డి సాజిద్, కురిమెల్ల సంపత్, సుందరిగిరి శ్రీనివాస్, సింగంశెట్టి లవన్ కుమార్, ఎర్రం కమల్, విశాల్ బాబు, జన్ను సుధాకర్, జంగం ప్రభాకర్, గౌస్, సిరిమల్లె చెన్నమల్లు, బత్తుల వినోద్, గొండ శ్రీను, దామెర రాజ్ కమల్, దొంతుల రాజేష్, కొమ్ము ఆశీర్వాదం, జన్ను అరవింద్, మదూరి నరేష్ పాల్గొన్నారు.

వెంకట్రామా జంక్షన్‌లో..

కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రజా యుద్ధనౌక గద్దర్ కు ఘనంగా నివాళులర్పించారు. నగరంలోని వెంకట్రామా జంక్షన్ లో జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గద్దర్ ఉద్యమ తీరును కొనియాడారు. ఆయన లేని లోటు మరులేనిదన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో గద్దర్ పాడిన 'పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న గానమా'పాట ఎంతటి ప్రభావం చూపిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదన్నారు. తన పాటలతో ప్రజా జీవితాలను ప్రభావితం చేశారన్నారు. గద్దర్ కు ఓరుగల్లుతో ఆత్మీయ అనుబంధం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ ఎంబాడి రవీందర్, కరాటే ప్రభాకర్ పాల్గొన్నారు.

పద్మశాలి బంధు ప్రకటించాలి

వారిపై వివక్ష తగదు

సమష్టి కృషితోనే రాజకీయ హక్కులు సాధించుకుంటాం

బీజేపీ రాష్ట్ర నాయకులు కుసుమ సతీష్, వన్నాల వెంకటరమణ

వరంలగ్ వాయిస్, కరీమాబాద్ : తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా పద్మశాలీలపై వివక్ష చూపుతోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుసుమ సతీష్ బాబు, రాష్ట్ర నాయకుడు వన్నాల వెంకటరమణ ఆరోపించారు. సోమవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నగరంలోని కొత్తవాడలో వరంగల్ జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో చేనేత మగ్గానికి పూలమాలలు వేసి ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పద్మశాలీలను ఓటు బ్యాంక్ గానే చూస్తోందని ఆరోపించారు. పద్మశాలీలు రాజకీయంగా అణిచి వేతకు గురవుతున్నారన్నారు. జనాభా ప్రాధిపతికంగా పద్మశాలీలకు 10 ఎమ్మెల్యేలు, మూడు ఎంపీ, మూడు ఎమ్మెల్సీ స్థానాలతోపాటు వార్డు సభ్యుల నుంచి జడ్పీటీసీ వరకు రాజకీయ హక్కులు సాధించు కోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. పద్మశాలీలను గుర్తించి జాతీయ దినోత్సవం నిర్వహించిన ఘనత దేశ ప్రధానికి దక్కుతుందన్నారు. పద్మశాలీలు ఏకీకృతమై పార్టీలకు అతీతంగా చేయూతను అందించు కోవాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడే రాజకీయంగా అన్నివర్గాలతో పోటీ పండగలమని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పద్మశాలీలకు పద్మశాలి బంధు ప్రకటించాలని డిమాండ్ చేశారు. దానికి బీఆరెస్ లో ఉన్న నాయకులు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు రావాలన్నారు. పదవుల కోసం పద్మశాలీ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టే నాయకులకు బుద్ధి చెప్పాలన్నారు. పద్మశాలీల కోసం నిత్యం ప్రజా క్షేత్రంలో ఉండే నాయకులను అసెంబ్లీకి పంపించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా పద్మశాలి బంధువులు ఒక్కసారి ఆలోచించాలన్నారు. పదవులను అడ్డు పెట్టుకుని పద్మశాలీల గొంతు నొక్కుతన్న నాయకులను పక్కకు పెట్టి రాబోయే స్థానిక ఎన్నికల్లో మన ఓట్లు మనమే వేసుకుని గెలిపించుకుని అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్, జిల్లా కార్యదర్శి ముంద్రాతి వెంకటేశ్వర్లు, ఐటి సెల్ జిల్లా కన్వీనర్ ఆడెపు వేంకటేష్, మాచర్ల దీన్ దయాల్, చిలువేరు రాజేందర్, భైరీ మురళీ కృష్ణ, బొడ్డు రాకేష్, వండ్ల సంతోష్, ఆడెపు నగేష్, కందకట్ల మల్లిఖార్జున్, ఆడెపు దేవేందర్, తుమ్మ రమేష్, కారప్పురి ఉమేష్, మామిడాల చంద్రమౌళి, గుంటుక శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తవాడలో..

జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం కొత్తవాడలో మాజీ కార్పొరేటర్ యెలుగం శ్రీనివాస్, చేనేత జేఏసీ నాయకులు కటకం విజయ్ కుమార్ ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం 23వ డివిజన్ పరిధిలోని పలువురు చేనేత కార్మికులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యెలుగం మల్లయ్య, చేనేత కార్మికులు కట్ల స్వామి, ఆనందపు వెంకటయ్య, గుర్రం రాజమౌళి, ఆడెపు చంద్రమౌళి, గోంగూర నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సైలెన్సర్లు మార్చితే క్రిమినల్ కేసులు

ట్రాఫిక్ ఏసీపీ భోజరాజు, పలు సైలెన్సర్ల ధ్వంసం

వరంగల్ వాయిస్, హనుమకొండ : ద్విచక్ర వాహనదారులు కంపెనీతో వచ్చిన సైలెన్సర్లలో ఎలాంటి మార్పులు చేసినా వాహనదారుడితో పాటు మార్పు చేసిన మెకానిక్ పై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని వరంగల్ కమిషనరేట్ ట్రాఫిక్ ఏసీపీ భోజరాజు హెచ్చరించారు. ట్రాఫిక్ పోలీసులు సోమవారం కేయూ క్రాస్ వద్ద అధిక శబ్దం చేసే ద్విచక్రవాహన సైలెన్సర్లను రోడ్ రోలర్ తో ధ్వంసం చేసారు. వీటిలో హనుమకొండ ప్రాంతానికి చెందినవి 70 కాగా కాజీపేట 65, వరంగల్ 65 ఉన్నాయి. అనంతరం ఏసీపీ భోజరాజు మాట్లాడుతూ వరంగల్ సీపీ అదేశాల మేరకు శబ్ద కాలుష్య నియంత్రణతో పాటు ప్రజాఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని అధికంగా శబ్దం చేసే ద్విచక్రవాహనలపై ప్రత్యేక దృష్టి సారించి తనీఖీలు చేపట్టామన్నారు. ట్రై సిటీ అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లు ఏర్పాటు చేసిన ద్విచక్రవాహనాలను గుర్తించి వాటి నుంచి మార్పు చేసిన సైలెన్సర్లను ట్రాఫిక్ పోలీసులు తొలగించడంతోపాటు వాటిని తిరిగి వినియోగించకుండా రోడ్ రోలర్ సాయంతో ధ్వంసం చేశామన్నారు. మెకానిక్ లు ఎట్టి పరిస్థితుల్లో ద్విచక్రవాహనాల సైలెన్సర్ల మార్పుకు ప్రోత్సహించవద్దన్నారు. కాదని వ్యవహరించేవారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమములో హనుమకొండ, వరంగల్, కాజీపేట ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్లు సీతారెడ్డి, వెంకట్, సుజాత, ట్రాఫిక్ ఎస్సైలు వేణు, యుగంధర్, పూర్ణచంద్రరెడ్డి, శ్రావణితో పాటు ఇతర ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

అంతరిక్షంలో ట్రాఫిక్ జామ్

వరంగల్ వాయిస్, శ్రీహరికోట : సువిశాలాకాశంలో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. అంతరిక్షంలో ఉపగ్రహాలకు చెందిన వ్యర్థాలు ఎక్కువయ్యాయి. ఇస్రో దీనిపై ఇటీవల ఓ స్టడీ చేసింది. స్పేస్‌లో దాదాపు 27వేల వస్తువులు ఉన్నట్లు గ్రహించింది. దీంట్లో 80 శాతం వరకు ఉపగ్రహ శిథిలాలే ఉంటాయని ఇస్రో పేర్కొన్నది. 10 సెంటీమీటర్ల కన్నా తక్కువ సైజులో ఉన్న వస్తువులు దాదాపు లక్షల సంఖ్యలో ఉంటాయని ఇస్రో చీఫ్ సోమనాథ్ తెలిపారు. యాంటీ శాటిలైట్ పరీక్షల ద్వారా ఏర్పడిన అంతరిక్ష వ్యర్థాలు కూడా ఎక్కువగా ఉన్నట్లు ఇస్రో అంచనా వేసింది. చైనా, అమెరికా, ఇండియా, రష్యాకు చెందిన పరీక్షల వల్ల ఆ వ్యర్థాలు ఏర్పడినట్లు తెలుస్తోంది. అంతరిక్షంలో వ్యర్థాలన్నీ జామ్ కావడంతో జూలై 30వ తేదీన నిర్వహించిన పీఎస్ఎల్వీ పరీక్ష ఆలస్యమైందని ఇస్రో పేర్కొన్నది. శ్రీహరికోటపై ఉన్న అంతరిక్ష ప్రాంతంలో వ్యర్థాలు చాలా ఉన్నాయని, అందుకే రాకెట్ ప్రయోగాన్ని ఒక నిమిషం ఆలస్యంగా నిర్వహించామని ఇస్రో చీఫ్ తెలిపారు. ఉదయం 6.30 నిమిషాలకు చేపట్టాల్సిన ప్రయోగాన్ని.. ఉదయం 6.31 నిమిషాలకు చేపట్టామన్నారు. 500 కిలోమీటర్ల దూరంలో ఉన్న భూకక్ష్యలో స్పేస్ వస్తువులు జామైనందు వల్లే ఆ ప్రయోగం ఆలస్యం జరిగిందని సోమనాథ్ తెలిపారు.

ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి

మాజీ కార్పొరేటర్ రామలింగం

వరంగల్ వాయిస్, హనుమకొండ : హనుమకొండ జిల్లా వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామంలో గతంలో గుర్తించిన ప్రభుత్వ భూమిని వెంటనే స్వాధీనం చేసుకోవాలని బీజేపీ మాజీ కార్పొరేటర్ నార్లగిరి రామలింగం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం హనుమకొండ జిల్లా జాయింట్ కలెక్టర్ మహేందర్ జీకి వినతి పత్రం అందజేశారు. ఇదే గ్రామానికి చెందిన కొంతమంది బడా భూస్వాములు వారికున్న పలుకుబడితో ప్రభుత్వ భూమిని అమ్మేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వెంటనే భూమిని స్వాధీనం చేసుకొని అర్హులైన దళిత, బలహీన వర్గాలకు పంపిణీ చేయాలని కోరారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN
DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com